విజయ మాసపత్రిక (జనవరి 77)

# వెన్నెముక

నళినీ మోహన్ ట్రయినింగ్ అయ్యాక ఆఫీసరుగా చేరి అప్పటికి వారం రోజులయింది.

ఆ వేళ ఆఫీసులో అడుగుపెట్టిన వెంటనే - అంతా లేచి అభివందనం చేసారు. సూపర్నెంటు సోమసుందరం ఆ పూట ఆఫీసుకి రాలేదు. ఎవరో ఆపదలో ఉన్నట్టు కబురు వచ్చి రెండు రోజులు సెలవు పెట్టాడతను. అతని సీటు ప్రక్కగా ఉన్న కుర్చీ కూడా ఖాళీగా ఉండడం క్రీగంట చూసాడు నళినీమోహన్!

స్వింగ్‌డోర్ తెరిచి పట్టుకున్న ప్యూను శంకరయ్యని అడిగాడు నళినీమోహన్.

"... ఎవరా సీట్లో కూర్చునేది?"

"కృష్ణమూర్తిగారండి..."

"రాగానే లోపలికి పంపు" అని శంకరయ్యతో చెప్పి విసురుగా లోపలికి వెళ్లిపోయాడు నళినీమోహన్.

అరగంట తర్వాత నళినీ మోహన్ ఎవరో చాంబర్‌లోకి రావటం గుర్తించి తలెత్తి చూసాడు.

బక్కపలచని మనిషి, లోతుకు పోయిన కళ్ళు, చప్పిదవడలు, మాసిన గెడ్డం, నలిగిన బట్టలు - అతను కృష్ణమూర్తిలా లేడు. శోకమూర్తిలా ఉన్నాడు... కాని, నళినీమోహన్ కళ్ళకి 'కేర్లెస్ ఫెలో'లా కనిపించాడు.

కాడల్లా ఉన్న చేతులు జోడించాడు..."...నన్ను పిలిపించారటండి!"

అతన్ని ఎగాదిగా చూసి క్రుద్ధుడై పోయాడు నళినీమోహన్. "ఓహో! వచ్చేసారన్నమాట... ఇప్పుడు టైమెంతమయిందో తెలుసా?"

తల వూపాడు కృష్ణమూర్తి.

"ఇదేనా మీ పంక్చుయాలిటీ?" అతని ముఖం వెలవెలబోయింది.

"... సోమసుందరంగారు మీకు చెప్పలేదాండీ?"

"ఆయన ఏమని చెప్పాలని మీ ఉద్దేశ్యం? మీరు గొప్పవాళ్ళని... మీ ఇష్టం వచ్చినప్పుడు దయచేస్తారని చెప్పాలా?"

"... అది కాదండి.. నేను... నేను...."

"కుంటిసాకులేం చెప్పకండి నాకు. నాకు కావల్సింది పంక్చుయాలిటీ. ఆఫీసుకు కరెక్ట్ టైంకు రావటం.. వెంటనే ఆఫ్ డేకి లీవ్ లెటర్ రాసి పట్రండి..."

కృష్ణమూర్తి కదల్లేదు.

".... ఏం? చెప్పింది వినపడలేదా?...."

"ఈ ఒక్కసారికి క్షమించండి ఇంకెప్పుడూ..."

"నథింగ్ డూయింగ్! మీరివ్వాళే కాదుట.. రోజూ లేటుగానే వస్తున్నారట... ఇవ్వాళ నా అంతట నేనే చూసాను. క్రమశిక్షణ అమలు చేయటానికే నేనిక్కడున్నది... మీ యిష్టం వచ్చినట్లు మీ యింట్లోలా ప్రవర్తిస్తే చూస్తూ ఊర్కోటానిక్కాదు... మీరీవేళ లీవు రాసి యివ్వక తప్పదు..."

కృష్ణమూర్తి ఏదో చెప్పబోయాడు.

'... నో నో! నేనింకేమీ వినదల్చుకోలేదు..."

"నాకు లీవు లేదండి...."

నళినీమోహన్ మరింత మండిపడిపోయాడు. "వాడ్డూయూ మీన్! ఇదింకా ఆగస్టు నెల. అప్పుడే శలవంతా అయిపోయిందా?.. సరే, ఈ రోజు జీతం కట్ చేస్తే ఇంకెప్పుడూ ఇలా చెయ్యకుండా బాగా గుర్తుంటుంది. వెళ్ళండి..."

కృష్ణమూర్తి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "అంతపని చేయకండి సార్!.. ఈ ఒక్కసారికి..."

"నో నో! ప్లీజ్ గెటవుట్! నేనింక మీ ముఖం చూడదల్చుకోలేదు..."

కాని, కావల్సిన లెటర్ కోసం కృష్ణమూర్తిని మరు నిముషంలో అతనే వెనక్కి పిలవాల్సి వచ్చింది. అప్పుడే కాదు... ఆ రోజున మరో ఆరుసార్లయినా అతని ముఖం చూడాల్సి వచ్చింది. అతను రాకుండా ఒక్క పని కూడా ముందుకు సాగలేదు నళినీమోహన్‌కు.

ఆ మర్నాడే ఊర్నించి వచ్చిన సోమసుందరంకి జరిగినదంతా చెప్పాడు కృష్ణమూర్తి.

"బాధపడకు మూర్తీ! నే నిక్కడుండగా నీకేం భయంలేదు" అని హామీ ఇచ్చాడు సోమసుందరం.

నళినీమోహన్ కబురు పంపే దానికి ముందే అతని ఛాంబర్‌లో అడుగు పెట్టాడాయన.

"గుడ్ మార్నింగ్ సర్!"

"ఎస్. గుడ్‌మార్నింగ్... రండి. మీ కోసమే చూస్తున్నాను.."

"ఈ రెండు రోజుల్లో నేలేకపోయే సరికి."

"... నాకు కొంచెం యిబ్బంది కలిగిన మాట నిజమే! ఎలాగో మేనేజ్ చేసేసాన్లెండి, ఎవరికో ప్రమాదంగా ఉందని వెళ్ళారు.... ఎలా వుందిప్పుడు?"

"... ఫర్వాలేదు. బ్రతికి బయటపడ్డాడు.. సమయానికి వెళ్ళి హాస్పిటల్లో చేర్పించాను..."

"అన్నట్టు ప్రాజెక్టు రిపోర్టు అర్జంటుగా కావాలని... హెడ్డాఫీసు నుంచి ఫోన్ వచ్చింది!"

"అదెంతసేపండి. ఈ పూట కృష్ణమూర్తీ, నేనూ కూర్చుని పూర్తి చేసేస్తాం!"

నళినీమోహన్ ముఖంలో నవ్వు మాయమైంది. "నో! అతను ఈ విషయంలో తలదూర్చడం నాకిష్టం లేదు!... మీరే తయారుచేయండి. కావాలంటే మరెవరి హెల్పయినా తీసుకోండి... కాని, అతను మాత్రం వద్దు!"

"అతని గురించి మీకు తెలియక అలా కోప్పడుతున్నారు. కాని..."

"రెండు రోజుల్లో అతనెటువంటి మనిషో నాకు బాగా తెల్సిందిలెండి. మీ కతని మీద అంత మంచి అభిప్రాయం ఉంటే దానికి నేను బాధ్యుడిని కాను... దట్సాల్..."

"అలాగే! మీ యిష్టం... కాని ఒక్కటి మాత్రం నేనిప్పుడు చెప్పగలను?... ఏ కృష్ణమూర్తిని బాడ్ కేరెక్టరుగా మీరీవేళ భావిస్తున్నారో అతన్నే మీరు పిలిచి మెచ్చుకునే రోజు అట్టేదూరం ఉండదు..."

అని అతని జవాబుకయినా ఎదురుచూడకుండా అక్కడ్నించి వెళ్ళిపోయాడు సోమసుందరం.

• • •

మరో పదిహేను రోజులు గడిచాయి. ఓనాడు సాయంత్రం ఆఫీసు టైము అయిపోయినా ఇంకా ఏదో పనిలో ఉండిపోయాడు నళినీమోహన్.

".. మీకు లేటయినట్టుంది"

"అబ్బే, పని పూర్తయ్యేదాకా నాకిలా ఆఫీసులో ఉండడం అలవాటే!" అని నవ్వాడు సోమసుందరం.

"అన్నట్టు... ఇప్పుడు కృష్ణమూర్తిలో మార్పు చూసారా?"

ఓ క్షణం ఆగి "చూసానండి" అన్నాడు సోమసుందరం.

"ఆవేళ మీరు నా మాట నమ్మలేదు... చూడండిప్పుడు ఫంక్చుయల్‌గా వస్తున్నాడు. ఆఫీసులో పని ప్రోగ్రెస్..... చూపిస్తున్నాడు.. ఇప్పుడు మీరు సి.ఆర్స్‌లో నిజాలే వ్రాయచ్చు."

సోమసుందరం తలదించుకు్కూర్చున్నాడు. కాని మాట్లాడలేదు.

"డోన్ట్ మిస్టేక్ మీ! కొంచెం స్ట్రిక్టుగా ఉంటే ఎలాంటి తలబిరుసు మనిషయినా ఎలా దారికొస్తాడో చూడండి... ఇంతకాలం మీరతని కేదో ప్రిఫరెన్సు చూపిస్తున్నారని అనుకుంటు న్నారు స్టాఫంతా... ఇక నుంచి ఆ మాట అనలేరు కదా! అందర్నీమనం సమదృష్టితో చూడాలండీ? అప్పుడే వాళ్ళ చేత సరిగ్గా పని చేయించగలిగేది? ఏమంటారు?"

"మీరన్నది నిజమే..."

మరింక లేద్దామా?"

"చిన్న రిక్వెస్టు? కృష్ణమూర్తి ప్రావిడెంటు ఫండ్ అడ్వాన్స్‌కి అప్లికేషన్ పెట్టుకున్నాడు..."

అంతలోనే నళినీమోహన్ గొంతు కఠినంగా మారిపోయింది. "నో! నేను శాంక్షన్ చేయలేను"

"నిజంగా అతని పరిస్థితి ఏమీ బాగా లేదు. మీరు నామాట నమ్మండి" అన్నాడు సోమ సుందరం.

"ప్లీజ్! నన్ను ఒత్తిడి చేయకండి. అతని కేసు స్టడీ చేశాకే నేను రిజెక్ట్ చేశాను. ఇప్పటికే జీతంలో చాలా కటింగ్ అవుతోంది... ఇంకా అడ్వాన్స్ తీసుకొని అతను ఖర్చు పెట్టేస్తే... ఎలా మేనేజ్ చేస్తాడు?... నోనో! అతనికిదంతా తలకు మించిన భారం అవుతుంది. దానిని మనం ప్రోత్సహించకూడదు."

సోమసుందరం మళ్ళీ నోరు విప్పేలోగా నళినీమోహన్ గది విడిచి బయటకు వచ్చేశాడు.

హాల్లో తన సీట్లో కూర్చుని ఇంకా ఏదో ఫైళ్ళు తిరగేస్తున్న కృష్ణమూర్తి కనిపించాడు.

"మీరింకా ఏం చేస్తున్నారిక్కడ?.." ఆశ్చర్యంగా అడిగాడు నళినీమోహన్.

ఏం జవాబు చెప్పాలో తెలియనట్లు అలాగే నిలబడిపోయాడు కృష్ణమూర్తి.

".. ఇంకా ఆఫీసు పట్టుకు ఏడుస్తావెందుకోయ్! నువ్విక్కడ రోగం వచ్చి మూలపడిపోతే చూసే వాళ్ళెవరూ లేరు! పో యిక్కడ్నించి..."

వెనకాలే వచ్చిన సోమసుందరం అలా కసురుకునేసరికి ఆశ్చర్యపోయాడు నళినీమోహన్.

ఓ క్షణం వాళ్ళిద్దర్నీ తేరిపార చూసి బయటికి వెళ్ళిపోయాడు నళినీమోహన్.

• • •

మరో వారం రోజుల తర్వాత నళినీమోహన్‌కు హెడ్డాఫీసు నుంచి ఫోను వచ్చింది... హఠాత్తుగా పై ఆఫీసరు పిల్చేసరికి ఏమిటో అని అతను మొదట కంగారు పడిపోయాడు. తీరా ఆ మాటలు విన్నాక అతని ఆనందానికి పట్టపగ్గాలు లేకపోయాయి. చిన్నపిల్లాడిలా పరుగుపెడుతూ ఛాంబరు బయటకు వచ్చాడు. "ఉన్నారా! వెళ్ళిపోయారేమో అనుకున్నా!"

"ఇంకా నా పని ఆపలేదండి. అదీ కాక మీరింకా వెళ్ళలేదని.." అన్నాడు సోమసుందరం.

".. ఈ నెలలో మన ఆఫీసు చూపించిన ప్రోగ్రెస్‌కి బాస్ చాల ఇంప్రెస్ అయ్యారండీ! ప్రత్యేకంగా ఫోన్ చేసి ఈ మాట చెప్పారు. అందులో ముఖ్యంగా ప్రాజెక్ట్ రిపోర్టు గురించి ఆయన మరీ పొగిడారు. నేను చేరిన నెలలోనే అన్ని పనులూ సవ్యంగా జరిగిపోతున్నందుకు ఆయన తెగ మెచ్చుకున్నారంటే నమ్మండి. అప్పుడప్పుడు మన పై ఆఫీసరు అలా మాట్లాడితే మనకెంతో ఎంకరేజింగ్‌గా ఉంటుంది! ఏమంటారు?"

"అవునండి. మీరీ సంగతి నాకు చెపుతుంటే నాకూ అలానే ఉంది." సోమసుందరం నిండుగా నవ్వాడు.

"ఆఫ్‌కోర్స్! మీ సహకారం లేకపోతే... నేనా రిపోర్టు టైముకి పంపగలిగేవాడిని కాదు.. నిజంగా ఈ క్రెడిట్ అంతా మీకే దక్కుతుంది.."

"అబ్బే, అందుకు నేనర్హుడ్ని కాదండి.... వాస్తవంగా అంత శ్రమ పడిన మనిషి వేరే ఉన్నాడు.."

నళినీమోహన్ ఆశ్చర్యపోయాడు. "ఎవరు? నాకు తెలియకుండా అంత శ్రమపడే మనిషి ఎవరండీ ఈ ఆఫీసులో..."

చేతిలో వున్న ఫైలు తీసి చూపించాడు సోమసుందరం.. "మీరీ రిపోర్టు చదివారు కదండీ?"

"అవును"

"దీని మీద మీ అభిప్రాయం?"

"ఎక్సలెంట్! మీరు వ్రాసిందే కదా!"

"... అంటే ఇంతకాలం ఇవన్నీ నేనే వ్రాసాననుకుంటున్నారా మీరు?"

"అవును మరి – మీవి కావా?"

"కావు... వాటి క్రింద ఇనిషియల్ మాత్రమే నాది..."

"మరయితే?"

".... అంత పని చేస్తూ మీ చేత ఇంకా చెడ్డవాడనిపించుకుంటున్న ఆ దురదృష్టవంతుడిక్కడే ఉన్నాడండి?" అని ప్రక్కనున్న గదివైపు నడిచాడు సోమసుందరం.

అక్కడ ఒళ్ళు తెలియని స్థితిలో బల్లమీద పడి వున్న కృష్ణమూర్తిని చూసి షాక్ తిన్నట్లయ్యాడు నళినీమోహన్! శంకరయ్య తడిగుడ్డతో అతని నుదురు ఒత్తుతున్నాడు.

"ఏమయిందతనికి?" కంగారుగా అడిగాడు నళినీమోహన్.

"రెండు రోజుల్నుంచి జ్వరమట. కళ్ళు తిరిగి పడేవరకు మాకు చెప్పుకోలేదు. మందూ, మాకూ ఎలాగా లేదు. కనీసం విశ్రాంతయినా లేక పోతే ఏమవుతుంది? ఇదిగో ఇప్పుడా స్థితికి వచ్చాడు."

"అదేమిటండీ? హాస్పిటల్‌కి వెళ్ళొచ్చుకదా?"

"మందులకి డబ్బు లేదు. అప్పడిగితే యిచ్చేవాళ్ళు లేదు. తీర్చలేడని వాళ్ళకి భయం. నేనిస్తే పుచ్చుకోడు. ఆఫీసు మానివేయటానికి శలవు లేదు. మానేస్తే జీతం రాదు. అతని బాధలు ఒకళ్ళు తీర్చేవేమిటి లెండి? కొందరు దురదృష్టవంతులంతే!"

నళినీమోహన్‌కి మనస్సు చివుక్కుమంది. ".. మీరీ సంగతి నాకు ముందే ఎందుకు చెప్పలేదు?"

"ఏమని చెప్పనండి?.... అతని పేరెత్తితేనే మీరు కోప్పడుతున్నారిన్నాళ్ళు!"

"నోనో! మీరు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు. డిసిప్లిన్ మెయిన్‌టెయిన్ చేయాలని నా ఉద్దేశ్యం కాని..."

సోమసుందరం ఇంక నిగ్రహించుకోలేకపోయాడు. "మీ దృష్టిలో పంక్చుయాలిటీ ఒక డిసిప్లిన్ కావచ్చు! కాని, నా లెక్కలో శ్రద్ధతో పని చేయించటమే డిసిప్లిన్!"

నళినీమోహన్ ముఖం చిట్లించాడు. "అంటే పంక్చుయాలిటీ అక్కర్లేదనా మీ ఉద్దేశ్యం?"

"కాదు. పని చేయని వాడిని అదుపులో పెట్టటానికి పంక్చుయాలిటీ అయినా కనీసం కావాలి... అవసరం వచ్చినప్పుడు తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా పని చేసేవాడిని మనం కొంచెం వెనకా ముందూ కనిపెట్టి చూడాలనే నా ఉద్దేశం! అప్పారావు ఠంచనుగా పదిగంటలకల్లా ఆఫీసులో ఉండచ్చు – ఎవరికి మేలు చేస్తుంది అతని పంక్చుయాలిటీ? రాసే రెండు మూడు డ్రాఫ్టులు తప్పుల తడకలు. అవి నేను మళ్ళీ తిరగ రాసుకోవాల్సిందే! అలాంటి వాళ్లు ఇద్దరు రోజంతా కూర్చుని చేసే పని కృష్ణమూర్తి ఒక్క గంటలో పూర్తి చేస్తాడని నేను రుజువు చేయగలను... ఎక్కడి దాకానో ఎందుకు? సూర్యారావు టేబుల్ చూడండి: ఇందులో సగం పని కృష్ణమూర్తి చేసినది... ఇక్కడ వెంకట్రావ్ రేక్ చూడండి. ఇందులో కృష్ణమూర్తి కలం ముట్టని కాగితం లేదు. ఈ ఆఫీసులో ఠంచనుగా పదిగంటలకి వస్తూ మీకు వంగి వంగి దణ్ణాలు పెడుతూ అతి వినయం నటించే ఈ గొప్ప వాళ్ళంతా కృష్ణమూర్తి సాయం పొందుతూనే ఉన్నారు. కాని, అతనికి కనీసం మీ నుంచి చూపుకుండా దక్కటం లేదు..."

నళినీమోహన్ కొయ్యబొమ్మలా నిలబడిపోయాడు.

"మీరతన్ని ఎంత అపార్థం చేసుకున్నారంటే, అతనొక్కడినే ప్రోగ్రెస్ రిపోర్టు రోజూ చూపించమన్నారు. కాని, అదేమాట తక్కిన వాళ్ళని అడిగారా? లేదు. మీరడిగి ఉంటే వీళ్ళందరి బండారం అపుడే బయటపడి ఉండేది? మీరడక్క పోయినా వాళ్ళ జాతకాలన్నీ ఇక్కడ జాగ్రత్త చేసి ఉంచాను. చూడండి. కృష్ణమూర్తి ఏం చేసాడో మీరు చూసారు. వీళ్ళు ఏం చేసారో చూడండి. మీకిప్పుడే తెలుస్తుంది. నిజమేమిటో?" అంటూ అతని చేతిలో కాగితాలు పెట్టాడు సోమసుందరం.

అవన్నీ చదివి వెలవెలబోయాడు నళినీమోహన్.

"మీరతని ప్రోగ్రెస్ రిపోర్ట్ చూసి మనిషి మారాడని సంతోషించారు. మీరు రాకముందు అతను ఎలాంటివాడో ఎంత పని చేసాడో తెలియక! కాని అతనెంత అమాయకుడంటే మీరావేళ అప్పారావుకి డ్రాఫ్టు రాసిపెట్టినందుకు కోప్పడ్డారని తను చేసిన ఎక్స్ట్రా పనులేమీ అతను రిపోర్టులో చూపించనే లేదు. ఆఖరికి నాకతను చేసిపెట్టిన పనులు కూడా అతనందులో చూపించలేదు. నేను మరో రెండేళ్ళలో రిటరయిపోతాను. ఇదివరకున్నంత ఓపిక నాకు లేదు. నా టైమంతా ఈ మహానుభావులు వ్రాసిన డ్రాఫ్టులు కరక్టు చేయడంతోనే సరిపోతోంది. ఇంక నా పని జరిగేదెప్పుడండి?.. అందుకనే కృష్ణమూర్తి సహకారం లేనిదే నేనీ పనులేవీ చేయలేకపోతున్నాను."

నళినీమోహన్ మనస్సు కరిగిపోయింది.

"ఆ వేళ రంగనాథం గారు రిటయిరయి వెళ్ళిపోతూ, మీకు ఛార్జి అప్పగిస్తూ ఈ ఆఫీసుకు నేను వెన్నెముక లాంటి వాడినన్నారు."

"అవును. దాన్నెవరూ కాదనలేరు!"

"కాని. నా వెన్నెముక కృష్ణమూర్తి! మీరిందాక అందించిన ప్రశంసలకు అర్హుడు అతను, నేను కాదు!"

"నిజంగా నాకీ సంగతులేమీ తెలియవు."

"నేను ఎంతో చెప్పాలనుకున్నాను. కాని మీరు వినలేదు. మీరు కళ్ళెదుట చూసిన వాటిని బట్టి అంచనాలు వేసుకున్నారు. ఎవళ్ళో చెప్పిన మాటలు విని అపోహపడ్డారు. మీకు తెలియంది చాలా వుందని నాకు తెలుసు. మీకు చెప్పే అవకాశం కోసమే ఇంత కాలం ఎదురుచూస్తున్నాను. స్మార్ట్‌గా బట్టలు వేసుకోవటానికి వెంకట్రావ్‌లా అతనికి ఓ వ్యాపారస్థుడైన మామగారు లేడు. శలవు వాడుకోకుండా ఆఫీసు ప్రాంతాల్లోనే ఉద్యోగస్తుల జీతాల మీద పడి బ్రతకటానికి నరసింహంలా వడ్డీ వ్యాపారం లేదు. అప్పారావులా పంక్చుయాలిటీ మెయిన్‌టెయిన్ చేయటానికి  అతనికి డ్యూటీ తెలియకా కాదు. నిర్లక్ష్యం వల్లా కాదు. పర్మిషన్ మీదనే అతను రోజూ ఓ గంట ఆలస్యంగా వచ్చేవాడు. ప్రొద్దున్న ఓ కంపెనీలో పార్ట్‌టైమ్ జాబ్ చేసుకునేవాడు. ఈ సంగతి రంగనాథం గారికి తెలుసు. మీతో మొదట్లోనే చెపుదామనుకున్నాను. అతని దురదృష్టం కొద్దీ నేను ఊరికి వెళ్ళాను. తిరిగి వచ్చి చెప్పేలోగా అతను మీ దృష్టిలో చెడ్డవాడయిపోవటం జరిగింది."

"ఇలా పార్ట్‌టైమ్ జాబ్‌కి పర్మిషన్ ఇవ్వటం రూల్స్ ఒప్పుకుంటాయా?"

"ఒప్పుకోవు. కాని తోటి మనిషి కష్టంలో ఉంటే ఆదుకోవటం వ్యక్తిగా మనధర్మం కాదంటారా?"

"అనను. ఆఫీస్ డ్యూటీకి ఆటంకం రానంతవరకు..."

"ఆమాట మీకు ముందే చెప్పాను. ఈ ఆఫీసుకు వాస్తవంగా అతనే వెన్నెముక అని. అతన్ని కష్టాల్లోంచి కాపాడటం అంటే మన ఆఫీసు పని కుంటుపడకుండా చూసుకున్నట్టే అని."

"మాటిమాటికీ అతని కష్టాల గురించే చెపుతున్నారు మీరు. ఏమిటో నా కర్థం కావటం లేదు!" అన్నాడు నళినీమోహన్ కొంచెం చిరాగ్గా.

"మీకు చెప్పాలనే ఇన్నాళ్ళుగా చూస్తున్నాను. పాపం ఏడాది క్రితం వరకూ అతనికి కష్టాలంటే ఏమిటో తెలియదు. వచ్చిన ఆపదలన్నీ అంచెలంచెల మీద కాకుండా హఠాత్తుగా ఒక్కసారే వచ్చి పడ్డాయి. చక్కని ఉద్యోగం చేసుకుంటున్న అన్నగారు కారు ఆక్సిడెంటులో ఉన్న పాటున చనిపోయాడు. ఇంకో ఏడాదిలో రిటైరవుతారనుకున్న తండ్రికి ఆ వార్త విన్న వెంటనే గుండె ఆగిపోయింది. తల్లి, పెళ్ళి స్థిరపడిన చెల్లెలు, పెళ్ళికెదిగిన చెల్లెలు, కాలేజీలో చదువుకునే తమ్ముళ్ళిద్దరు వీరికి తోడు వదిన - ఆమె పిల్లలిద్దరు - ఇందరికీ అతడే

ఆధారం!"

సోమసుందరం వైపు కన్నార్పకుండా చూసాడు నళినీమోహన్.

"ఆఫీసులో ఇంత పని చేస్తున్నాడు కదానీ ఓవర్టయిమ్ ఇవ్వటానికి మనకు పవర్స్ లేవు. వీళ్ళందరికి అతని కుటుంబ పరిస్థితి తెలుసు. పర్మిషను తీసుకొనే ఆలస్యంగా వస్తున్నాడని తెలుసు. అయినా తమకు లేని అదృష్టమేదో అతను అనుభవించేస్తున్నాడని దుగ్ధ. బాధ్యత పంచుకోవటానికి ఎవ్వరూ ముందుకు రారు. సుఖాల్లో వాటాకి మాత్రం అంతా సిద్ధమవుతారు. ఇంక మీరు 'ఔటాఫ్ ది వే' వెళ్ళి అతని ఓవర్టయిమ్‌కి రికమెండ్ చేస్తే వీళ్ళు భరించగలరా? అతని కేదో లాభం చేసేస్తున్నామని పైకి రిపోర్టులు వ్రాస్తారు. అందుకనే తండ్రి ప్రావిడెంటు ఫండు డబ్బువచ్చి అప్పులు తీరేదాకా నయినా కొంచెం నిలదొక్కుకుంటాడని అతనికి నేనే ఆ పార్ట్‌టైమ్ జాబ్ ఇప్పించాను. అది కూడా రంగనాథం గారి అనుమతి తీసుకున్నాకనే! పాలిచ్చే గోవునే అంతా పిండుతారు. నేనూ అంతే! అతని రక్తమాంసాలు పిండి పని చేయించుకుంటున్న నా పాపానికి కొంత పరిహారం చెల్లించుకున్నానింతవరకూ!"

సోమసుందరం గొంతు బొంగురుపోయింది.

నళినీమోహన్ చకితుడయ్యాడు "సుందరంగారూ!"

"మీ ఆర్డర్సు ప్రకారం పంక్చువల్‌గా ఆఫీసుకు వస్తున్నాడు. కాని సిటీబస్సులో రావటానిక్కూడా డబ్బుల్లేక నడిచి వస్తున్నాడు. మధ్యాహ్నం టీ త్రాగటానికయినా శక్తి లేక కడుపు మాడ్చుకుంటున్నాడు. పోనీ ఆఫీసు పనిలో ఏమయినా లోపం చేసాడేమో చెప్పండి. అతనికి ఆ పార్ట్‌టయిమ్ జాబ్ పోయింది. దాని మీద వచ్చే ఆదాయం పోయింది. అతనంత సిన్సియర్‌గా పనిచేస్తున్నందుకు మనమిచ్చిన 'రివార్డ్' ఏమిటి? ఓ రోజు జీతం నష్టం. అడ్వాన్స్‌కి అప్లికేషన్ పెడితే...."

"సుందరం గారూ!" నళినీమోహన్ ఉద్వేగాన్ని ఆపుకోలేక పోయాడు.

"క్షమించండి. మీరు మా ఆఫీసరు. మీతో యిలా మాట్లాడింది మిమ్మల్ని ఇన్సల్ట్ చేయాలని కాదు. విమర్శించాలని కాదు.అతనికి నేను కలుగజేసిన అవకాశం అభిమానం మీద కాదని చెప్పటమే నా ఉద్దేశ్యం. జెన్యూన్ కేస్ కాబట్టే ఇలా చేయాల్సి వచ్చిందని చెప్పటమే నా ఉద్దేశ్యం! ఒక్క సిన్సియర్ వర్కర్‌ని మనం కాపాడుకుంటే మన ఆఫీసు 'సెటప్'ని రక్షించుకుంటున్నట్టని చెప్పటమే నా ప్రయత్నం."

నళినీమోహన్ అపరాధిలా తల త్రిప్పుకున్నాడు.

"మీ చేత మంచి వాడిననిపించుకోలేకపోతున్ననే అతనెక్కువ బాధపడుతున్నాడుకాని, ఆర్థాకలితో ఆఫీసుకు వస్తున్నందుకు కానే కాదు. ఇంతకంటే అతని సిన్సియారిటీకి ఏం రుజువు చూపగలను?"

నళినీమోహన్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. 'ఆయామ్ సారీ! ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ!"

●